# కనకాంబరాలు



జగం!

కనకాంబరాలను చూడడమే తడవుగా నా కనులలో నీళ్లునిండి హృదయం కలతబారుతూందని మా కనకానికేం తెలుసు? క్రొత్తగా కాపురానికివచ్చిందయ్యె! — పెండ్లి జరిగినప్పటినించీ ఏర్పడిన కొద్ది పరిచయంతోనే పలుకుతూ — చిరునగవులతో చిలిపిచూపుల ప్రసరిస్తూ, కోరికల వూరిస్తూ సుఖస్వప్నాల తేలిపోతూంది నన్ను పూర్తిగా అర్థంచేసుకోలేకపోయినా.

మాయిద్దరి కలయికదినాలలో కనకాంబరాలను ధరించేంత విరివిగా అవి లభింపక పోయినయ్ కనకానికి. అందుచేత నాకా పుష్పాలు వేదనాకరాలని గ్రహించేంత వీలు కలుగలేదు ఆవిడకు....

డాబామీద చల్లగాలికి కూర్చుండి తూర్పు దిశ వినీలాకాశాన తన — శీతల కిరణాలతో వెల్గొంది పోతూన్న చందమామను చూస్తూ హర్ష ప్రఫుల్ల హృదయుడనై-వివిధ భావాలతో మనోవీధిని విహరిస్తూన్న నాకు — కారుమేఘ మొకటి చందమామను మ్రింగుకుంటూ పోతూవున్న దృశ్యం మూలంగా కొంత నిశ్చలత్వం చేకూరి — వింతభావముత్పన్నమై — వెనుక నిలచిన అర్థాంగిని చూడలేకపోవడం — ఆమె నాయీ అవస్థకు చిరునగవులతో — మొగమంతా వింత సొగసు ఏర్పడగా — కనులు మూసింది మృదుహస్తాలతో.

ఘుమఘుమలాడే మల్లె సౌరభంతో మనస్సు మధురమయమై పోయింది అంతలోనే. కనకం ధరించిన మల్లెదండను సవరించుతూ అప్రయత్నంగా చూడ్కులదానిపై బరపాను ఆమల్లెపూల మధ్య అందంగా అచ్చటచ్చట కనకాంబరాలు గ్రుచ్చబడివున్నయ్.

కనకాంబరాలను చూడటంతోనే కనుల నీళ్లు నిండినయ్! ఉస్సురని నిట్టూరుస్తూ కనకాన్ని ప్రక్కకు వదలి కనులుమూసుకున్నాను. — నాయీ విచిత్ర పరివర్తనకు తెల్లబోయింది కనకం. జాలిగా మొగంలోకి చూచింది. నా కళ్లనీళ్ల చూడ్డమే ఆమె కళ్లను సైతం నీళ్లూరినయ్!

నాబాధ తనమూలాన ఏర్పడిందేమోనని శంకతో విహ్వలచిత్తయై ఎన్నో రీతుల నిందించుకొని — పెల్లుబికిన దుఃఖంతో మాటాడలేక నాభుజాన మొగం వోర్చింది అమాయకత్వంగా.

ఎన్నోవిధాల ఊరడించాను అందుకు తాను కారణంకాదని. కాని ఆమెకు విశ్వాసం కలుగలేదు. అంతకంతకూ మితిమించిన దుఃఖంతో వాపోవసాగింది. — కనకాంబరాలే యిందుకు కారణమంటే అప్పటికీ నమ్మక — "ఆఁ! కనకాంబరాలు కారణమా? —" అంటూ అనుమానంతో మరింత దూరపిల్లింది. నా సద్వర్తనాన్నే అనుమానించి దూరమై — పైటతో మొగాన్ని కప్పుకొని కంపించిపోసాగింది పెనుగాలిలోని ఆకులా — ఆమె దీనస్థితికి మనస్సు మరింత బాధపడింది. లేచి దగ్గఱకు వెళ్లి అనునయిస్తూ — "కనకా! అనవసరంగా నీవు బాధపడ మాకు. నాయీ వేదనకు నిజంగా కనకాంబరాలే కారణం కాని నీవనుకునే విధంగా మాత్రం నేనూ — నా ప్రవర్తనా అనుమాన స్పదమైన విధంగాకాదు. నీవు ఏడుపుమాని కారణం విను. —" అంటూ కౌగిటజేర్చి తలనిమిరాను. నా యీ అనునయవాక్యాలకు కొంత సంతోషాన్ని దొరకినా — నామాటలయందు అంతగా విశ్వాసం లేనట్టుగా చూచింది మొగాన్ని ఓరగాబెట్టి. వెన్నెల కాంతి పడటంవల్ల ఆమె నేత్రాలనిండివున్న కన్నీరు తళతళ మెరిసింది. — ఇక ఆలసించడంవల్ల అన్యాయంగా ఆమె మనస్సును వ్యాకుల పెట్టడమవుతూందని — ఓ దీర్ఘనిట్టూర్పుతో కనకాంబరాల

గాథనే కరవు పెట్టసాగాను. వివిధ భావోద్రేకాలతో నేను కథ చెప్పుతూవుంటే— కనకం సైతం అట్టి విధంగానే విస్మయంతో వినసాగింది కథ.

"ఏడాది క్రితం మాట—అప్పటికి విజయను చూచి రెండు సంవత్సరాలు దాటిపోయినై. అనేక కారణాలచేత...అంటే జైలులో పెట్టబడి అప్పటికి విడుదలై వుండడంచేత—ఆమెను చూచేందుకు వెళ్లలేకపోయాను.—నెలకో రెండు నెలలకో మా విజయను చూచేందుకు వాళ్లవూరు వెళ్తూవుంటే వాణ్ణి. ఆసారి విజయను చూచివచ్చాను. అలావచ్చిన పదిరోజుల నాటికే—దేశమంతా స్వాతంత్ర్య సమరసన్నద్ధమై వుడికెత్తిపోతోంది. ఏకారణంలేకపోయినా నన్ను తీసుకొనిపోయి బంధించారు ప్రభుత్వంవారు.—అంతతో దేశీయ విషయాలను తెలుసుకోవడానికైనా వీలులేకపోయింది. ఎంతోమంది త్యాగులు రొమ్ము విరచి ముందునిలచి తుపాకీ గుండ్లను పూలచెండ్ల మాడ్కి భావించి జీవనాలను ఆ స్వాతంత్ర్య సమరయజ్ఞానికి ఆహుతి గావించారు. ఎంతోమంది వీరులు తమ క్రొన్నెత్తురుతో పతాకను రక్తరంజితము గావించారు—యిలాంటి ఎన్నో విషయాలు విడుదల అనంతరం తెలిసినై— నేను జైలునించి విడుదలపొంది రావడంతోనే మా విజయను చూడాలని కోరిక పుట్టింది,—ఎప్పుడు నేను విజయను చూడాలని వెళ్లినా—ఆమెకు అభిమానమైన కనకాంబరాలను ఓబుట్టెడైనా కొని తీసుకుపోయేవాడిని. అవి ఆమెకు ఎంతో ఆనందం కలిగించేవి. విజయ వాటిని చూడ్డమే వికసించిన మొగంతో 'బావా! యివి తేవడంవల్ల నీ విజయను నీవు మరచిపోలేదనే నమ్మకం ఏర్పడుతూంది సుమా' అంటూ చిరునవ్వులతో ఎంతో కృతజ్ఞత గనబరిచేది.—మా బావ తెచ్చాడంటూ యిరుగు పొరుగు వాళ్లందరకూ పంచిపెట్టి—తానూ తలనిండుగా కనకాంబరాల మాలను ధరించి కిలకిలలాడుతూ—కిలకిల నవ్వేది.

అందుకే మామూలుగానే—ఓ బుట్టెడు కనకాంబరాలను తీసుకొని మా విజయదగ్గఱకు ప్రయాణం కట్టాను. మధ్యాహ్నానికి యిల్లుజేరుకొని—మామూలుగానే నవ్వుకుంటూ—"విజయా! విజయా!!" అని కేకలు పెట్టుకుంటూనే లోనకు ప్రవేశించాను. నాగొంతు వినడమే పరుగు పెట్టుకుంటూ ఎదురువచ్చే విజయ ఎంతకూ రాకపోవడంవల్ల విస్మయుడనై పోయాను. చావడిలోని కుర్చీలో కూలబడి మొగాన స్రవించే చెమ్మట బిందులను తుడుచుకో సాగాను.—తిరిగి—విజయా! అని కేక బెట్టాను.

"ఎవరూ?—మనోహారం!—ఎప్పుడు రావడం?" ప్రశ్నపై ప్రశ్న వేస్తూ విశ్వనాథం గదినించి చావడిలోనకు వచ్చి నాముందు కుర్చీలో కూలబడ్డాడు.—నా మొగం చూడ్డమే అతని వదనం విచారాక్రాంతమై కన్నుల నీళ్లు జలజల రాలసాగినై.—విశ్వనాథుని ఆ వింతస్థితికి విస్మయం మరింత అధికమైంది నాకు.—"విజయ ఎక్కడ?" అన్నాను విహ్వల హృదయంతో.

"విజయ! ఎక్కడ విజయ?—వెళ్లిపోయింది మనోహార్! మనల్ని విడచి—బానిస భారతదేశాన్ని విడచి—స్వేచ్ఛాజీవినియై—ఏ బానిసత్వమూలేని ఆ లోకానికి వెళ్ళిపోయింది. ఇక మనకు విజయ లేదు.—మనోహార్! లేదు. విజయ లేదు—" విచలిత హృదయంతో—వెఱ్ఱి చూపులతో—పసిపాపలవలె బిగ్గరగా ఏడ్చాడు విశ్వనాథం.

ఆ వార్త పిడుగుపాటుగా నన్ను అణచివేసింది. గుండెల్ని చీల్చివేసింది. కంపించిపోయే తనువుతో—"విశ్వం! లేదూ! విజయ లేదూ?—వెళ్లిపోయిందీ! విజయ! మా విజయ—హా! అబ్బా!..." అంతకుమించి మాట్లాడలేకపోయాను. కనురెప్పలు తమ కర్తవ్యాన్ని మఱచి స్థాణువులైపోయినై! చూపులుకూడా వాటినే అనుసరించినై!!—కన్నీరు కాలువలయై ప్రవహించసాగింది.—నిశ్చలత్వం ఆవరించింది నన్ను. నిర్జీవ ప్రతిమనైపోయిన నన్నూ—నా స్థితినీ జాలిగా చూస్తూ—విశ్వనాథం విజయ-

మరణవిషయాలు చెప్పుకొంటూ పోసాగాడు. అవి నా చెవులనించి హృదయాన్ని తూట్లుపడేట్లు ప్రవేశించ సాగినై.—...

"మనోహర్!—నేను నా కర్తవ్యపాలనకై-స్వాతంత్ర్య సమరంలో—నా సహచరులను నడుపుకొంటూ ప్రజలను ప్రబోధిస్తూ బయలుదేరాను. ఒకరోజున మమ్ము ప్రభుత్వం ఎదురుకుంది. లాఠీ చార్జి చేశారు. అప్పటికి మేం జంకలేదు. మా దళమంతా మితిమించిన వుత్సాహోద్రేకాలతో జయజయ ధ్వానాలు గావించాం. అంతలో తుపాకులతో బెదిరించారు. మేం రొమ్ములు చూపాం. కాల్చారు. కొంతమంది నేలకొరిగారు. కాని మా కర్తవ్యాన్ని మేం విస్మరించలేదు. తిరిగి ముందుకు నడవసాగాం. నాయకుడనైన నన్ను బంధించారు. తమను నడిపే సరియైన నాథుడు లేక మిగిలినవారు చెల్లాచెదరై పోయారు. ఈ వార్త విజయకు తెలిసిందట. తక్షణం త్రివర్ణపతాకం చేతధరించి బైలుదేరిందట. తిరిగి అందరనూ ఒకచోట జేర్చి తీవ్రమైన మాటలతో హెచ్చరించి, కర్తవ్యాన్ని జ్ఞప్తికి తెచ్చిందట. అందరూ అతిశయించిన వుత్సాహంతో-ఉద్రేకంతో ఆమె వెనువెంట బయలుదేరారట!!—విజయ విశ్వవిఖ్యాతికరంగా—వీరనారీ శిరోమణిగా తుపాకీ గుండ్లకు ఎదురునిలచి—విజయపతాకను చేదాల్చి—అందరూ విస్తుపోయేట్లు—తన దళాన్ని నడుపుతూ వుందట! అంతలో ఓ తుపాకీగుండు—మరోగుండు-యిలా ఎన్నో—ఒళ్లంతా తూట్లుపడిపోయినా—వీసమంతైనా వెనుకకు నడవక అలానే-ఆ చోటునే వీరమరణమందిందట.

విజయత్యాగాన్ని వేనోళ్ల పొగుడుతూ ప్రజలు ఆమెను మహోత్సవంతో దహనం గావించారు.

use KESHA-MITRA
HAIR-OIL
(VEGETABLE)
A LITTLE'S ORIENTAL BALM PRODUCT
మృదువైన నిగనిగలాడు కేశసంపదకు
కేశమిత్ర

వెజిటబుల్ తలనూనెనే వాడుడు.
బట్టతల కానీయదు. చుండు నివారణచేయును. కేశములను రాలి పోనివ్వదు.
లిటిల్స్ ఓరియంటల్ బామ్ & ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్.
11-12, ఫస్టులైన్ బీచ్ :: మదరాసు.

అచ్చటనే ఓ సమాధి స్మారక చిహ్నంగా నెలకొలిపారు. నేను మొన్న మొన్న జైలునించి విడుదలై వచ్చి—యీ వార్తలువిని దిగ్భ్రాంతి పడిపోయాను.—మనోహర్! "యిక నేముంది? మనకు విజయలేదు. లేదు మనోహర్! విజయ—మనకు—లేదు.—" అని కండ్లనీళ్లు పంచెచెంగుతో ఒత్తుకొన్నాడు.

త్యాగమయమైన విజయ మరణవృత్తాంతం కొంత పూరట కలిగించింది మనస్సుకి. కన్నీటిని తుడుచుకుంటూ—"విశ్వం! విచారపడకు. విజయ వీరనారియై మరణించింది. ఆమె త్యాగం అత్యంత ప్రశంసనీయం.—తన జన్మసాఫల్యత గావించుకున్నందుకు మనం—" అంటూనే చూపులను కనకాంబరాలపైకి అప్రయత్నంగా బరిపాను. అవి చూడ్డమే తిరిగి నా కన్నులలో నీళ్ళు నిలచినై.—"ఇక ఎవరికివ్వనీ పూలను. మా విజయ ఎంత ఆనందించేది యీ పూవులనుచూచి!—ఇక నెందుకివి—" అనుకుంటూ వేదనతో నిట్టూరుస్తూ—వాటినితీసి చూడసాగాను.

కనకాంబరాలను చూచి విశ్వంసైతం వేదన పొందాడు. పెను నిట్టూర్పుతో "మనూ! కనకాంబరాలు తెచ్చావా మరచిపోకుండా? ఇంకెవరికిస్తావు మనూ! వెళ్లిపోయింది. విజయ వెళ్లిపోయింది.—అరె! అలా నలిపివేస్తావేం? నీ విజయ లేకున్నా—ఆమెకై తెచ్చిన పూలను గ్రహించేందుకు—ఆమె స్మృతిచిహ్నం—వుంది మనూ! వుంది. పద వెళ్ళి అచ్చట వాటిని వుంచుకువుగాని. పద.—" అని లేచాడు.

మరుమాటలేక నేనూ ఆ పూలబుట్టతో, వాని వెంట బైలుదేరాను. ఆ పూలను విజయ సమాధిపై విరజిమ్మి కన్నీట నా చోటును తడిపి—ఏడ్చాను హృదయం పగిలి చిన్నాభిన్నమైపోయేలా. దీక్షగా చూస్తూన్న నాకు ఆ సమాధినించి—చిరునవ్వులతో చూస్తూ—చేత త్రివర్ణపతాకాన్ని చూపుతూ—మరోచేత కనకాంబరాలను గ్రహించి మెడను దాలుస్తూ—'బావా! కనకాంబరాలు గ్రహించాను. నా జ్ఞాపకార్థం కనకాంబరాలు వున్నయ్ సుమా!—మరచిపోకేం' అంటూన్నట్లు గ్రహించింది.—అలా చూస్తూనే చీకటిపడేవరకు అచ్చటనేవుండి—తిరిగి యింటికి జేరుకున్నాం యిద్దరమూను. తిరుగు బండికే యింటికివచ్చాను నేను..."

ఇంతతో కథ ముగించి కనకాన్ని చూచాను. కనకం సైతం నన్ను చూచింది. ఇద్దరి చూపులూ కలిసినై!—దీర్ఘమైన నిట్టూర్చి—"యిక కనకాంబరాలను ధరించి మీకు కష్టం కలిగించను. గతాన్ని జ్ఞప్తికిదెచ్చి మీ—" మాటలాడలేక ఒడిలోకి ఒరిగిపోయింది కనకం.

ప్రభాత్
రెడీమేడ్ దుస్తులు
PRABHAT PRODUCTS MADURA
★ తక్కువ వెల
★ చిరకాలపు మన్నిక
ప్రభాత్ రెడీమేడ్
మానుఫాక్చరింగ్ కంపెని,
మధుర (S. I. R.)